సిద్ధిపురి కథలు

# షూటింగ్

“ఆరు నూరైనా సరే... సినిమా యాక్టర్నై తీరుత్తా!”

-ఐతా చంద్రయ్య.

ఎప్పట్లాగే డైలాగొదిలేసి గల్లా ఎగరేసిన ప్రేమానందం కనుబొమ్మలెగిరి పడినై.

కాకతీయుల కళాతృష్ణకు ప్రతి రూపమైన భోగేశ్వరాలయంలో సినిమా షూటింగ్. కళ్ళారా చూసి, మనసారా ఆనందించేందుకొచ్చిన మిత్రులకేసి గర్వంగా చూశాడు.

బ్రహ్మాండమైన జోకువిన్నట్లు కోరస్‌గా నవ్వారంతా.

“కొయ్యకురా కోతలు ప్రేమా!” ధన్‌రాజందుకున్నాడు నవ్వాపుకుని “నాలాగా పాటలు రాసి నోళ్ళంతా సినిమా కవులు కానట్టే నీలాగా పది నాటకాల్లో వేషాలు వేసినోళ్ళంతా సినీ నటులు కాలేరు నాయనా!”

“నిజమే... దాని కదృష్టం కావాలి.” పసలేని కేసు నిర్దాక్షిణ్యంగా కొట్టేసిన జడ్జీలా చెప్పేశాడు శశికాంత్.

రవి, శశికాంత్, నాగరాజు, అందరి సపోర్ట్ ధన్‌రాజ్‌కే లభించింది.

“మీరట్లాగే అనుకోండి. నేను మాత్రం...”


“చాల్లేవోయ్. ఉద్యోగాల్లో చేరాం. పెళ్ళిళ్ళు గూడా చేసుకున్నాం. ఇంకా పిచ్చిపిచ్చి ఊహలు మానేసి త్వరపడండి. సినిమా షూటింగ్ షురువైపోతది.” దేవరాజు మందలింపు.

“పెళ్ళయితే మాత్రం ఏంటటా!” ప్రేమానందం చేయి మీసం మీదికెళ్ళింది. పేడిమూతి తగిలి జారిపోయింది. దాంతో నోరు మూతబడింది.

యువతీ యువకులూ, పిల్లలూ, పెద్దలూ భోగేశ్వరాలయం చుట్టూ జనప్రవాహం. ఇసుక వేస్తే రాలనంత జనం తొక్కుకుంటున్నారు. తోసుకుంటున్నారు. అరుస్తున్నారు. అరగంట ముష్టియుద్ధం తర్వాత ప్రహరీగోడ దొరికింది మిత్రబృందానికి. ఎక్కి కూచున్నారు. ఓ పక్క గట్టి పోలీస్‌బందోబస్తు మరోపక్క కుమ్ములాటలు.

బ్యూటీ క్వీన్ లవంగి మేటి హీరో సుగుణాకర్‌ల యుగళగీతం షూటింగట. ఒళ్ళంతా కళ్ళై పోయినై.

“ప్రేమానంద మెవరండీ?” సాదాసీదా మనిషి అడిగాడు. ప్రేమానందాన్నే.



"పోవోయ్ పో... వాడు దిగితే కూచుందామనా ప్లాను. ఆ ఆటలేమీ నడవ్వు...పో!" ఝాడించాడు రవి.

"అది కాదండి. నేనీ సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్ని. కాలుజారి పడిపోయాడు హీరో. కాలు విరిగింది, ఈ ప్రాంతంలో ప్రేమానందం గారనీ గొప్ప స్టేజీ యాక్టరున్నారటా..."

లంకలో హనుమంతుడిలా దూకేశాడు ప్రేమానందం." నేనేనండీ!" అంటూ వెంటనే.

"మీరు నాతో రండి" అంటూ తీసికెళ్ళాడు అసిస్టెంట్ డైరెక్టర్.

"చూడండి ప్రేమానందంగారూ!" డైరెక్టర్ చేతులు జోడించాడు.

"ఈ సినిమాలో హీరో సుగుణాకర్ కిదే మొదటి షాటు. అతని కాలు విరిగింది. హాస్పిటల్‌కి పంపించాం. ఈ సిన్మాలో మీరే హీరో. మీకు మంచి భవిష్యత్తుంటుంది సుమా!"

"షూటింగంతా రెడీ అయింది. ఇప్పుడు క్యాన్సలైతే లక్షల్లో నష్టం. మీరు నాటకాల్లోబోలెడు బహుమతులు కొట్టేశారని విన్నాం. ప్లీజ్... ఈ పాత్ర ఒప్పుకోండి." అగ్రిమెంటు ముందుంచాడు నిర్మాత.

అరె... ఇది నిజమేనా? వెతకబోయిన మల్లెతీగ కాలిబాటన వేలికి తాకినట్టనిపించింది ప్రేమానందానికి. ఎదలో ఆనంద కెరటాలెగిరి పడుతున్నై. కాని... బయటపడితే చులకనైపోతుంది.

"నరే.... మీరింతగా అంటున్నారు కాబట్టి ఒప్పుకుంటున్నాను."అగ్రిమెంటు సంతకమై పోయింది.

డాన్స్ డైరెక్టర్ పాటమీద స్టెప్పులేసి చూపించాడు. హీరోయిన్ లవంగితో రిహార్సల్. చేతులూ కాళ్ళూ కలుసుకున్నాయి. భుజాలు ఒరుసుకున్నాయి. గడ్డివాము మీంచి దొర్లుతూ ఒకరి మీదొకరు పడిపోయారు. ఒళ్ళు జిల్లు జిల్లుమంది.

పాట షూటింగ్ సజావుగా జరిగిపోయింది.

"భేష్ ప్రేమానందం!" డైరెక్టర్ తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు. ప్రేమానందం మీద ప్రశంసల జల్లు కురిసింది. మిత్రబృందం ఆనందానికి అవధుల్లేవు. ఆకాశానికెత్తేశారు.

సినిమా ట్రూప్ హోటల్ అమరావతి చేరుకుంది.

భోజనాలయాక

"ప్రేమానందం గారు నా గదిలో అడ్జెస్టయిపోతారు లెండి." లవంగి నిర్మాతతో చెప్పేసింది. కలువకళ్ళను కమ్మగా తిప్పేస్తూ ప్రేమానందాన్ని మేడమీది తనగదిలోకి తీసుకెళ్ళింది. ఎదురుగా దగ్గరగా కూచుంది.

"మీరింత గొప్ప యాక్టరనుకోలేదండీ! అబ్బ! ఏమాస్టెప్పులూ...ఏమా భంగిమలూ...ఏమిటా చొరవా! సీనియర్ హీరోలంతా మీముందు నిలువరిక!" సంతోషాన్ని పట్టలేక అతని అరచేతుల్ని తన చెంపల కద్దుకుంది.

"నిజంగానా!" ఆరాటం బయటపడనీయకుండా దూరం జరగబోయాడు. ఫక్కున నవ్వింది లవంగి.

"అలా కుదరదండీ. మీరిలా రండి." భుజాల మీద చేతులేసి బెడ్రూంలోకి నడిపించుకెళ్ళింది.

ఏ.సి.గది. హాయిగా ఉంది. కిటికీ అద్దాల్లోంచి సిద్దిపురి అందాలు వీధిలైట్ల వెలుగుల్లో కనబడు తున్నాయి.

అతని ముందే డ్రెస్సు మార్చి నైటు గౌను వేసుకుంది లవంగి. హబ్బ... మెరిసే బుగ్గలు... బలిష్టమైన అవయవాలు... పాలరాతి విగ్రహం... కళ్ళు జిగేల్‌మన్నయ్. ఎదలో గోల.

"ఎందుకలా చూస్తున్నారు?" పెగ్గు పెదా[illegible]ందించింది హుషారెక్కి

" మై డియర్ లవంగీ! కమాన్! ఆలస్య[illegible] అమృతం విషం గదూ!" మంచ మ్మీదికి తోశాడు. పక్కలో చేరి చక్కిలిగింతలు పెట్బాడు. మత్తు గమ్మత్తు.

"అబ్బా... ఆశ!" గబుక్కున మంచం దిగి పరుగెత్తింది.

"ఇంకా ఆలస్యమెందుకు డియర్!" వెంటనే మంచమ్మీంచి దూకేశాడు. కాలు తిరగబడింది.

"అబ్బో... అమ్మో...!" అరిచాడు. కళ్ళు తెరిచాడు.

"ఏమైందండీ! అలా మంచమ్మీంచి పడిపోయారు.' ప్రేమానందం భార్య పరుగెత్తు కొచ్చింది.

"అయ్యో... కలనా!" నీరుగారిపోయి లేవబోయాడు. కాలు లేవనీయలేదు.


"ఆదివారం పట్టపగలు... మళ్ళీ సినిమా కలనా?" లబలబమంటూ కాలులేపబోయింది. నొప్పి... ప్రాణంపోయే నొప్పి. వారించాడు. పక్కపోర్షన్ల వారంతా చుట్టూ చేరారు.

ఆటోలో హాస్పిటల్ కెళ్ళాక తెలిసింది... కాలు విరిగిందని. ★

-ఐతా చంద్రయ్య
ఇ.నం.4-4-11, శేర్‌పురి
సిద్దిపేట - 502 102.

## సౌరశక్తితో నడిచే సోలార్ కార్

వాహనాలు రోడ్లపై ఎక్కువగా తిరగటంవల్ల కాలుష్యం ఏర్పడుతోందని ఒక పక్క పర్యావరణ శాస్త్ర వేత్తలు గగ్గోలు పెడుతున్నా...వాహనాల సంఖ్య గాని, కాలుష్యం కాని తగ్గలేదు, పెట్రోలు, డీజిలు అవసరం లేకుండానే కార్లు రయ్‌మని రోడ్లపై దూసుకెళ్ళగలవని అంటున్నారు జపాను వాసులు. కెమెరాలు తయారు చేసే కయాసెరా కార్పోరేషన్ వారు (ఎస్.పి.వి.-2) అనే కారును తయారు చేశారు. ఇది సౌరశక్తి, నికెల్ శక్తి సాయంతో నడుస్తుంది. ప్రస్తుతం ఇది ప్రయాణానికి సిద్ధంగా ఉన్నప్పటికీ...ఇంకొన్ని మెరుగులు దిద్ది 2000 సంవత్సరం నాటికి రోడ్ల మీదికి వదులు తామంటున్నారు కయాసెరా కార్పోరేషన్ వారు




కెంచు చిన్నన్న, ఆర్టిస్ట్ & కార్టూనిస్ట్, చిన్నమెట్‌పల్లి - 505453, మేడిపల్లి (తా) కరీంగన్ (జిల్లా)